న్యూస్‌రీల్

నేడు పరిష్కార వేదిక ఉండదు

• కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: దీపావళి పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు ఉన్నందున కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం లేదని కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. అర్జీలు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావొద్దని కోరారు.

మోసగాడిపై కేసు

రామగిరి: పింఛన్లు, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బు వసూలు చేసి మోసగిస్తున్న టీడీపీ వర్గీయుడు సదాశివపై రామగిరి పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. రామగిరి మండలం దుబ్బార్లపల్లికి చెందిన సదాశివ తన పింఛన్ పునరుద్ధరింపజేస్తానంటూ రెండు విడతలుగా రూ.24 వేలు ఇప్పించుకుని మోసం చేశాడని రామగిరికి చెందిన శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సదాశివ ఆగడాలపై ఈ నెల 15న 'సాక్షి' దినపత్రికలో 'సదా మోసమే' శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. కలెక్టరేట్ ఏఎస్‌ఓనని చెప్పుకుంటూ పలువురి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డాడు. అనంతపురం, పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి తదితర ప్రాంతాలలో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను, పింఛన్ ఇప్పిస్తానంటూ అమాయకులను మోసగించాడు. ఇప్పటికే ఇతనిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి.

ఆంధ్ర, ఢిల్లీ మ్యాచ్ డ్రా



తలపడుతున్న ఢిల్లీ - ఆంధ్రా జట్లు

అనంతపురం కార్పొరేషన్: సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా అండర్ -23 ఆంధ్ర, ఢిల్లీ జట్ల మధ్య జరిగిన నాలుగు రోజు క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించడం విశేషం. ఆదివారం అనంత క్రీడా గ్రామంలో నాలుగో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 200/5తో ఆట ప్రారంభించిన ఢిల్లీ జట్టు 126 ఓవర్ల వద్ద 394 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో దేవ్ లక్రా సెంచరీతో కదం తొక్కాడు. 220 బంతులను ఎదుర్కొని 16 ఫోర్లు, 3 సిక్సర్లతో 158 పరుగులు సాధించాడు. అతనికి తోడుగా క్రిషియాదవ్ 70 పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్లలో పి.ఆదిత్యరెడ్డి 3, సాయి శ్రావణ్ 3, జి.సుమిత్ 2 వికెట్లు కూలదోశారు. అనంతరం ఆంధ్ర జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 8 ఓవర్లలో వికెట్ నష్టపోయి 43 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అనంతరం ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో మ్యాచ్ రెఫరీ సంజయ్ వర్మ మాట్లాడారు. బీసీసీఐ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను జిల్లా క్రికెట్ సంఘం పక్కాగా అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రూ. 4 లక్షల అపహరణ

తాడిపత్రి టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ మహిళ వద్ద రూ.4 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను దుండగులు అపహరించారు. వివరాలు.. అనంతపురానికి చెందిన విజయలక్ష్మి బుక్కరాయసముద్రం పీహెచ్‌సీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం ఆమె తాడిపత్రిలోని చేనేత కాలనీకి చెందిన నాగరత్నమ్మకు అప్పు చెల్లించేందుకు రూ.4 లక్షల నగదును బ్యాగ్‌లో పెట్టుకుని బస్సులో తాడిపత్రికి చేరుకున్నారు. బస్టాండ్ వద్ద ఉన్న పూల అంగళ్ల వద్ద నడుచుకుంటూ వెళుతున్న విజయలక్ష్మి చేతిలోని బ్యాగును ముఖానికి ముసుగు ధరించిన ఓ పురుషుడు, మరో మహిళ లాక్కొని ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి, కేసు నమోదు చేశారు.

• దివ్వెల కేళి.. వెలుగులు నిండాలి



దీపాలను వెలిగించిన మహిళలు, చిన్నారులు

చీకటిని పారదోలుతూ కొత్త వెలుగులు నింపేందుకు దీపావళి పర్వదినం వచ్చేసింది. సోమవారం పండుగను ఘనంగా జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమైపోయారు. ఆదివారం రాత్రి నుంచే ప్రతి ఇంట్లో సందడి నెలకొంది. దీప కాంతుల వెలుగుల్లో కొత్త శోభ సంతరించుకున్నాయి. దీపావళి పర్వదినాన సాక్షాత్తు మహాలక్ష్మి భూలోకానికి వచ్చి ఇల్లిల్లూ తిరుగుతుందని అందరి నమ్మకం. ఈ క్రమంలో అమ్మవారిని మనసారా కొలిచేందుకు సర్వం సిద్ధం చేసుకున్నారు. ఇక.. ఆదివారం జిల్లావ్యాప్తంగా టపాకాయల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దుస్తులు, ఎలక్ట్రానిక్ షాపుల్లోనూ సందడి నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం







అనంతపురంలో టపాసుల దుకాణాల వద్ద సందడి

చితికిన చెనిక్కాయ

నాడు కళకళ.. నేడు చతికిల

- 65 ఏళ్ల జిల్లా చరిత్రలో ఈ ఖరీఫ్‌లోనే కనిష్ట సాగు
- లక్ష లోపు హెక్టార్లకు పరిమితమైన ప్రధానపంట
- నష్టాలు, ఆర్థిక సమస్యలతో సాగుపై రైతుల అనాసక్తి
- గత 30 ఏళ్లలో నాలుగు సార్లే పంట చేతికొచ్చిన పరిస్థితి
- 1.05 లక్షల హెక్టార్లకు కంది



అనంతపురం అగ్రికల్చర్: పెరిగిన పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు, కానరాని గిట్టుబాటు ధరలకు తోడు కూలీల సమస్య, చీడపీడల వ్యాప్తి, అడవిపందులు, జింకల బెడద, పంట నష్ట ఉపశమనం తక్కువగా ఉండటం, అందులోనూ గరిష్ఠంగా రెండు హెక్టార్లకే ఇన్‌పుట్ ఇస్తుండటం, పంటల బీమా కింద పెద్దగా పరిహారం రాకపోవడం.. ఇలా కర్షుడి చావుకు సవాలక్ష కారణాలు అన్న చందంగా క్రమంగా వేరుశనగ పంట తన ప్రాశస్త్యాన్ని కోల్పోతూ వస్తోంది. ఒకానొక దశలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుశనగ సాగు విస్తీర్ణం 8 లక్షల నుంచి 9 లక్షల హెక్టార్ల గరిష్టస్థాయికి చేరుకుంది. జిల్లాలో ఎటు చూసినా వేరుశనగ మినహా మరో పంట కనిపించే పరిస్థితి లేకుండా ఉండింది. అక్కడక్కడా ఇతరత్రా పంటలు ఉన్నా వేరుశనగ మధ్యలో అంతర పంటలుగా మాత్రమే సాగవుతూ వచ్చాయి. అలా వేరుశనగ పంట ఏకపంటగా విస్తరించి జిల్లాను పూర్తిగా ఆక్రమించింది. ప్రపంచంలో ఏ దేశంలో కూడా ఒక జిల్లాలో ఈ స్థాయిలో వేరుశనగ పంట పండించడం లేదని చెప్పేవారు. ఇలా 1960 దశకం నుంచి మొదలైన వేరుశనగ ప్రాభవం లక్షలాది హెక్టార్లతో 2015 వరకు అప్రతిహతంగా కొనసాగింది. అలాంటి పంట విస్తీర్ణం ఈ ఖరీఫ్‌లో కేవలం 91 వేల హెక్టార్లకు పరిమితమై రెండో స్థానానికి దిగజారిపోయింది. అటు శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా కేవలం 49 వేల హెక్టార్లలోనే సాగవడం గమనార్హం.

30 ఏళ్లలో నాలుగు సార్లే గిట్టుబాటు..

అధికారిక లెక్కల ప్రకారం గత 30 ఏళ్లలో కేవలం నాలుగు సంవత్సరాల్లో వేరుశనగ మంచి దిగుబడులు రావడంతో గిట్టుబాటయ్యింది. మరో ఏడేళ్లు పెట్టుబడులు దక్కించుకోగా తక్కిన 19 సంవత్సరాలు వేరుశనగ పంట రైతులకు నష్టాలు మిగిల్చింది. సగటున ఎకరాకు 10 బస్తాలు లేదా హెక్టారుకు వెయ్యి కిలోల వరకు వేరుశనగ దిగుబడులు వస్తేనే పంట బాగా వచ్చినట్లు లెక్క. 1995 నుంచి 2024 వరకు వేరుశనగ పంట దిగుబడులు పరిశీలిస్తే అందులో 1995లో మాత్రం వేరుశనగ పంట బాగా పండింది. 1995లో హెక్టారుకు సగటున 1,310 కిలోల దిగుబడులు వచ్చాయి. ఆ తరువాత 1998లో 1,145 కిలోలు, 2000లో 1,116 కిలోలు, 2007లో 1,259 కిలోల దిగుబడులు వచ్చాయి. ఈ నాలుగేళ్లు పంట చేతికివచ్చింది. ఇక ఏడు సార్లు హెక్టారుకు రూ.500 కిలోల నుంచి 950 కిలోల మధ్య రావడంతో పంటకు పెట్టిన పెట్టుబడులు దక్కాయి. ఇక తక్కిన 19 సార్లు వేరుశనగ దారుణంగా దెబ్బతిన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2006లో కేవలం 67 కిలోలు, 2008లో 88 కిలోలు...ఇలా 100 కిలోల లోపే దిగుబడులు రావడంతో ఎకరాకు అర బస్తా కూడా పండిన దాఖలాలు లేవు. ఈ క్రమంలో సమస్య పరిష్కారానికి 2012లో భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) అప్పటి డైరెక్టర్ జనరల్ డాక్టర్ అయ్యప్పన్ నేతృత్వంలో 18 మంది నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ జిల్లాలో పర్యటించి వేరుశనగ సాగును తగ్గించి చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, గోరుచిక్కుడు లాంటి పంటలను వేయాలని సిఫారసు చేసింది.

కంది టాప్..

ఈ ఖరీఫ్‌లో కంది పంట చరిత్ర సృష్టిస్తూ సాగు విస్తీర్ణంలో మొదటిస్థానంలో నిలిచింది. 55,296 హెక్టార్లుగా అంచనా వేయగా రెండింతలు అధికంగా 1.05 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగులోకి రావడం గమనార్హం. మరికొన్నేళ్లు కంది మొదటి స్థానం నిలబెట్టుకునే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. కందితో పాటు ఆముదం, మొక్కజొన్న పంటల సాగు బాగా పెరుగుతూ వేరుశనగను వెనక్కి నెట్టేస్తున్నాయి. ఈ ఖరీఫ్‌లో అన్ని పంటలు 3,43,232 హెక్టార్లలో సాగులోకి రావచ్చని అంచనా వేయగా... అననుకూల వర్షాల కారణంగా 88 శాతంతో 3.02 లక్షల హెక్టార్లకు చేరుకున్నాయి. అందులో కంది 1.04 లక్షల హెక్టార్లు, వేరుశనగ 91 వేలు, పత్తి 26 వేలు, మొక్కజొన్న 29 వేలు, ఆముదం 16 వేలు ఇలా ఈ ఐదు పంటలే 80 శాతం ఆక్రమించాయి. నీటి వసతి కింద 25 వేల హెక్టార్లలో వరి సాగులోకి వచ్చింది.

ప్రతి ఇంటా కాంతులు విరియాలి



అనంత వెంకట్రామి రెడ్డి

అనంతపురం: దీపావళి పండుగతో ప్రతి ఇంటా ఆనందాల కాంతులు విరియాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చీకటి అనే చెడును పారదోలే వెలుగు అనే మంచికి సంకేతంగా దీపావళిని జరుపుకుంటామని పేర్కొన్నారు. పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు వారి దగ్గర ఉండి జాగ్రత్తలు పాటించేలా చూడాలని సూచించారు.

కలెక్టర్ దీపావళి శుభాకాంక్షలు



కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ ఓ.ఆనంద్ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి అనుగ్రహంతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, అందరి ఇళ్లలో సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందమయ జీవితం గడపాలని కోరుకున్నారు. దీపావళిని అందరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలి



బోయ గిరిజమ్మ

అనంతపురం టవర్‌క్లాక్: దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆకాంక్షించారు. ఈ మేరకు ప్రజలకు ఆదివారం ఆమె పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంట్లో ఆనందం నిండాలని ఆకాంక్షించారు. పండుగ సందర్భంగా టపాకాయలు కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

చంద్రబాబు దుర్మార్గపు పాలనపై ప్రజా ఉద్యమం





భారీ సంఖ్యలో హాజరైన నాయకులు, కార్యకర్తలు, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అనంత వెంకటరామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, ఎల్‌ఎం. మోహన్‌రెడ్డి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి
- కార్యకర్తలకు పెద్దపీట వేసేందుకే సంస్థాగత కమిటీలు: మెట్టు

రాయదుర్గంటౌన్: సీఎం చంద్రబాబు దుర్మార్గపు పాలనపై ప్రజా ఉద్యమం ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ, పంచాయతీ సంస్థాగత కమిటీల ఎంపికపై అవగాహన కార్యక్రమంతోపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం 'దుర్గం'లో లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త సైనికుడిలా మారాలన్నారు. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట వేసేందుకే కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామ కమిటీలతో వైఎస్సార్‌సీపీ తిరుగులేని శక్తిగా మారుతోందన్నారు. కార్యకర్తలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా అండగా నిలవనున్నట్లు చెప్పారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. వైద్య కళాశాలలు పూర్తయి వైద్యం పేదలకు అందుబాటులోకి వస్తే జగన్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే చంద్రబాబు వాటిని ప్రైవేటీకరణ పేరుతో తన అనుయాయులకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణతో ప్రభుత్వం మెడలు వంచి ప్రైవేటీకరణను నిలుపుదల చేద్దామని పిలుపునిచ్చారు. నకిలీ మద్యానికి ఏపీ అడ్డాగా మారిందన్నారు. బెల్టు దుకాణాలు తెరిచి.. వాటి ద్వారా కల్తీ మద్యాన్ని అమ్ముతూ కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్‌ఈసీ మెంబర్ గౌని ఉపేంద్రరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉషారాణి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాజగోపాలరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పొరాళ్ల శివకుమార్, పట్టణ కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామాంజనేయులు, కణేకల్లు, బొమ్మనహాళ్, గుమ్మఘట్ట, డీ.హీరేహాళ్ కన్వీనర్లు బ్రహ్మానందరెడ్డి, రామాంజనేయులు, గౌని కాంతారెడ్డి, రామాంజనేయులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మీనాక్షి.. మనసులో గుచ్చి..



సినీ నటి మీనాక్షి చౌదరి ఆదివారం అనంతపురంలో సందడి చేశారు. ఓ కారు షోరూం ప్రారంభోత్సవానికి హాజరైన ఆమెను చూసేందుకు నగరవాసులు తరలివచ్చారు. సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు పోటీ పడ్డారు. నగరానికి రావడం ఎంతో ఆనందంగా ఉందని నటి మీనాక్షి చౌదరి తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

21 నుంచి పోలీసు అమర వీరుల వారోత్సవాలు



అనంతపురం సెంట్రల్: పోలీసు అమర వీరుల వారోత్సవాలను ఈనెల 21 నుంచి 31 వరకూ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమరులైన పోలీసులను స్మరించుకుంటూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు వివరించారు. సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాలపై ప్రజల్లో అవగాహన తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 1959 అక్టోబర్ 21న లడక్‌లో చైనాతో జరిగిన యుద్ధంలో అనేక మంది దేశం కోసం అసువులు బాశారని, అమరవీరులను స్మరించుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

వారోత్సవాలు ఇలా..

- 21న స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళి.
- 22, 23 తేదీల్లో పోలీసు అమరుల గ్రామాల సందర్శన, అమరుల సేవలపై అవగాహన.
- 24 నుంచి 27 వరకూ చర్చా వేదికలు, వక్తృత్వపు పోటీలు.
- 26న పోలీసు త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్ర ప్రదర్శన.
- 26 నుంచి 27 వరకూ ఓపెన్‌హౌస్, విద్యార్థులకు అవగాహన.
- 28న వైద్య శిబిరాలు.
- 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు.
- 30న పోలీసు అమరుల కుటుంబ సభ్యులకు సన్మానం.
- 31న జిల్లా వ్యాప్తంగా సమైక్యతా దినం ఆచరణ, సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ.

క్లుప్తంగా

ఆత్మ పీడీగా శివనారాయణ



అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా జి.శివనారాయణ నియమితులయ్యారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ డైరెక్టర్లు (డీడీఏ)కు అడహాక్ పద్ధతిలో జాయింట్ డైరెక్టర్లు (జేడీ)గా పదోన్నతులు దక్కాయి. ఈ క్రమంలో డీడీగా ఉన్న శివనారాయణకు జేడీగా పదోన్నతి కల్పించి ఆత్మ పీడీగా బదిలీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు తీసుకునే అవకాశం ఉన్నట్లు ఇన్‌చార్జ్ పీడీ పద్మలత తెలిపారు. కాగా, బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన అన్నమయ్య జిల్లా జేడీగా వెళ్లనున్నట్లు సమాచారం. ఈ డిసెంబర్ నెలాఖరులో ప్రస్తుత జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఉద్యోగ విరమణ తర్వాత తిరిగి అనంతపురం జిల్లా జేడీఏగా శివనారాయణ రానున్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

జిల్లాకు 950 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) కంపెనీ నుంచి జిల్లాకు 950 మెట్రిక్ టన్నుల యూరియా అందినట్లు రేక్ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియా బస్తాలను ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు 700 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు, మిగిలిన 250 మెట్రిక్ టన్నులను ప్రైవేట్ డీలర్లకు కేటాయించినట్లు వివరించారు.

చిరుత దాడిలో దూడల మృతి



మృతి చెందిన దూడ

కళ్యాణదుర్గం: మండలంలోని మల్లాపురంలో చిరుతదాడిలో రెండు దూడలు మృతిచెందాయి. వివరాలు.. మల్లాపురం గ్రామానికి చెందిన రైతు ఆటో వెంకటేష్.. గ్రామ సమీపంలోని తన తోటలో రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం ఆవులు, దూడలను కట్టేసి ఇంటికెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో పశువుల పాకలోకి చొరబడిన చిరుత రెండు దూడలను చంపేసింది. ఓ దూడను సగానికి పైగా తినేసింది. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించి రైతు లబోదిబోమన్నాడు. గతంలోనూ ఓ ఆవును చిరుత చంపేసిందని, ప్రస్తుతం రెండు దూడలు మృతి చెందాయని కన్నీటిపర్యంతమయ్యాడు.

లారీని ఢీకొన్న కారు

- ఒకరి పరిస్థితి విషమం, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



రాప్తాడు: రోడ్డు పక్కన నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు..... రాప్తాడు సమీపంలోని మహేంద్ర షోరూం ఎదురుగా 44వ జాతీయ రహదారి పక్కన ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయంలో ఓ కంటైనర్‌ను డ్రైవర్ ఆపాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వెళుతున్న కారు... లారీని వెనుక నుంచి ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న తమిళనాడుకు చెందిన రాజ్‌కుమార్, ఆయన భార్య లలిత, కుమారుడు శబరీష్ తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవ్ చేస్తున్న తండ్రి పక్క సీటులో కూర్చొన్న కుమారుడి పరిస్థితి విషమంగా మారింది. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా తొలుత అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం శబరీస్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సేవ పేరుతో దోపిడీ

భక్తుల సెంటిమెంట్‌ను ఆదాయ వనరుగా మార్చుకున్నారు కొందరు స్వార్థపరులు. సేవ పేరుతో చందాలు వసూలు చేస్తూ అక్రమార్జనకు తెరలేపారు. ఇందుకు ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం వేదికగా చేసుకున్నారు. ఆలయం దేవదాయ శాఖ పరిధిలో ఉన్నా... పెత్తనం మొత్తం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండడంతో భక్తులకు అసౌకర్యాలు తప్పడం లేదు.

- పంపనూరు క్షేత్రంలో అక్రమార్కుల దందా
- భక్తుల సెంటిమెంట్‌తో వ్యాపారం
- అనధికారికంగా గోశాల, అన్నదానం నిర్వహణ
- సేవ పేరుతో రూ. లక్షల్లో వసూళ్లు
- ఆడిట్ వివరాలు లేవంటున్న ఎండోమెంట్ అధికారులు



ఆలయం వద్ద అనధికారికంగా నిర్వహిస్తున్న గోశాల



అనధికార వసూళ్లకు ఏర్పాటు చేసిన టేబుల్ (ఇన్‌సెట్) భక్తుల విరాళానికి ఇచ్చే రసీదు

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలోనే కాకుండా కర్ణాటకలోనూ భక్తుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న ఆత్మకూరు మండలం పంపనూరులో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్ర ప్రతిష్టను కొందరు స్వార్థపరులు దిగజారుస్తున్నారు. దేవదాయశాఖ పరిధిలోని ఈ ఆలయంలో పెత్తనమంతా ప్రైవేట్ వ్యక్తులదే కావడం గమనార్హం. ప్రతి వారమూ రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా... ఆ ఆదాయం ఏమవుతుందో ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఒకప్పుడు 3.90 ఎకరాల్లో విస్తరించిన ఈ ఆలయం.. ప్రస్తుతం 50 సెంట్లకు మించి లేదు. మిగిలిన ప్రదేశంలో అనధికార గోశాల, అన్నదాన కమిటీ అంటూ ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకున్నారు. స్వామికి సేవ చేస్తున్నామనే పేరుతో నెలకు రూ. లక్షల్లో దోపిడీ సాగిస్తున్నారు.

పెత్తనమంతా వారిదే..

దశాబ్దాలుగా పంపనూరు ఆలయంలో ప్రైవేటు వ్యక్తుల హవా కొనసాగుతోంది. ఇదేమని అడిగితే స్వామి వారికి సేవ చేస్తున్నామని చెబుతున్నారు. దేవదాయ శాఖకు ఎలాంటి సంబంధం లేకుండా ఆలయంలో గోశాల నిర్వహణ, అన్నదానం అంటూ కమిటీలు ఏర్పాటు చేశారు. గోశాలను ఆదినారాయణ నాయుడు, అన్నదాన కమిటీని సత్య రంగయ్య అనధికారికంగా నిర్వహిస్తున్నారు. గోశాలలో ప్రస్తుతం 60 వరకు ఆవులు ఉన్నాయి. ఆలయానికి వచ్చే భక్తులను గోపూజ పేరుతో ఆకర్షిస్తూ మేత, ఇతర పోషణకు రోజుకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక చందాల రూపంలో అయితే 15 రోజులకు రూ.300, 30 రోజులకు రూ.500, 90 రోజులకు రూ.1,200 అంటూ బోర్డులు పెట్టి మరీ వసూలు చేస్తున్నారు. అయితే ఆవులకు మేత, ఇతర పోషణ ఖర్చులు మొత్తం ఆలయ నిర్వహణ ద్వారానే సమకూరుతుండడం గమనార్హం. ఇక అన్నదాన కమిటీకు సంబంధించి ఆలయంలోనే మూడు ప్రదేశాల్లో టేబుళ్లు వేసుకుని చందాలు వసూలు చేస్తున్నారు. ఇందుకు రసీదు కూడా ఇస్తున్నారు. అయితే వీటికి సంబంధించి ఎలాంటి ఆడిట్ ఉండదు. భక్తుల సెంటిమెంట్‌ను తెలివిగా వ్యాపారంగా మార్చి నిలువు దోపిడీ చేస్తున్నారు.

రికార్డులంటూ ఏమీ ఉండవు..

అనధికారికంగా నిర్వహిస్తున్న గోశాల, అన్నదాన కమిటీలకు సంబంధించి ఎలాంటి రికార్డులు ఉండవు. గోశాల, అన్నదాన కమిటీలకు వారానికి రూ.లక్షల్లోనే ఆదాయం సమకూరుతోంది. ఈ ఆదాయానికి సంబంధించి జమాఖర్చులపై నిర్వాహకులు కానీ, దేవదాయ శాఖ ఈఓ కాని సరైన వివరాలు వెల్లడించలేకపోతున్నారు. గోశాల, అన్నదాన కమిటీలకు దాతలు, భక్తులు విరాళంగా ఇచ్చిన నగదు ప్రస్తుతం ఎంత మేర ఉందో కూడా స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. ఈ అంశంపై ఇటీవల నిర్వాహకులను పంపనూరు గ్రామస్తులు నిలదీశారు. ఆ సమయంలో వారికి సరైన సమాధానాలు ఇవ్వలేక నిర్వాహకులు వాగ్వాదానికి దిగారు. ఆలయ ఈఓ బాబు సైతం స్పందించకుండా ఎండోమెంట్‌తో అన్నదాన కమిటీ, గోశాలకు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకున్నారు. ఈ మొత్తం గోల్‌మాల్ వ్యవహారాన్ని ఎండోమెంట్ అధికారులు అత్యంత గోప్యంగా ఉంచడం వెనుక మర్మమేమిటో సుబ్రహ్మణ్యేశ్వరుడికే తెలియాలని భక్తులు అంటున్నారు. అక్రమాలు పెచ్చుమీరుతున్నా.. దేవదాయ శాఖ ఈఓ మాత్రం తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం ప్రస్తుతం వివాదాస్పదమవుతోంది. ఇదంతా గమనించిన భక్తులు ఆలయ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆలయ ప్రతిష్ట దిగజారుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భాషా పండితుల సమస్యలపై రాజీలేని పోరాటం

- పండిత పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎర్రిస్వామి

అనంతపురం సిటీ: రాష్ట్రంలోని భాషా పండితుల సమస్యల పరిష్కారానికి తాను రాజీ లేని పోరాటం సాగిస్తానని పండిత పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎర్రిస్వామి అన్నారు. అనంతపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఎర్రిస్వామి దంపతులను ఆ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎర్రిస్వామి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. పండిత పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. 2004 నుంచి అనేక పోరాటాలు చేసి భాషా పండితుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో పని చేసి, భాషల ఉనికికి, తెలుగు సంస్కృతిని కాపాడేందుకు తాను ముందుంటానని హామీ ఇచ్చారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తులసిరెడ్డి, ఏపీటీఎఫ్–1938 అసోసియేషన్ అధ్యక్షుడు కులశేఖర్‌రెడ్డి, పీఆర్‌టీయూ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్టీయూ నుంచి రమణారెడ్డి, యూటీఎఫ్–రమణయ్య, పీఈటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారెడ్డి, కార్పొరేటర్ శ్రీనివాసులు, హెడ్మాస్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో విద్యా వ్యవస్థ

- ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

అనంతపురం సిటీ: రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ప్రమాదంలో పడిందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురంలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఖాళీలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గతంలో ప్లస్ టూ పాఠశాలల్లో పని చేసిన వారిని తిరిగి అదే పాఠశాలలకు నియమించి విద్యా ప్రమాణాల మెరుగునకు చొరవ తీసుకోవాలన్నారు. రిలీవర్ రాకపోవడంతో చాలా మంది బదిలీ అయిన ఉపాధ్యాయులు పాత పాఠశాలల్లోనే పని చేస్తున్నారన్నారు. వారిని తక్షణమే బదిలీ స్థానాలకు పంపాలన్నారు. పీఆర్సీని ఏర్పాటు చేసి, బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. అర్హులైన ఎస్జీటీ (పండిట్లు)లకు పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం ఎన్‌టీఏ జిల్లా తాత్కాలిక కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పతకమూరి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా రవి, ఆర్థిక కార్యదర్శిగా వెంకటేశులు, అదనపు కార్యదర్శిగా వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి శివశంకర్ హాజరయ్యారు.

కూటమి అరాచకాలపై పోరుకు సిద్ధంకండి



కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సమన్వయకర్త విశ్వ. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు రమేష్‌రెడ్డి, తదితరులు

- గ్రామ కమిటీలు నిర్మాణాత్మకంగా పనిచేయాలి
- ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 28న భారీ నిరసన
- వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు విశ్వ

ఉరవకొండ: కూటమి ప్రభుత్వ అరాచకాలపై పోరుకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ ఉరవకొండ సమన్వయకర్త, పీఏసీ సభ్యుడు వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల తరపున పార్టీ గ్రామ, అనుబంధ విభాగాల కమిటీలు నిర్మాణాత్మకంగా పనిచేయాలన్నారు. ఆదివారం ఉరవకొండలోని వీరశైవ కల్యాణ మంటపంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు తాడిపత్రి రమేష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కరరెడ్డి హాజరయ్యారు. విశ్వ మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయకుండా ప్రభుత్వమే నిర్వహించే వరకూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాలు మరింత ఉధృతంగా సాగిద్దామని పిలుపునిచ్చారు. ఏడాదిన్నర పాలనలో ఆరోగ్యశ్రీ పథకానికి సీఎం చంద్రబాబు తూట్లు పొడిచారన్నారు. 108, 104 గాలికొదిలేశారని విమర్శించారు. రాష్ట్రంలో పాలన పూర్తి అవినీతిమయమైందని ధ్వజమెత్తారు. రైతాంగ సమస్యలు గాలికొదిలేసి ఎరువులు, విత్తనాలు అందించలేని దౌర్భాగ్య స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నియోజకవర్గమంతటా ఉద్యమంలా కొనసాగాలన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 28న ఉరవకొండలో తలపెట్టిన భారీ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలన్నారు.

వజ్ర భాస్కరరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక మోసం చేయడమే చంద్రబాబు నైజమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో గ్రామ కమిటీలదే కీలక పాత్ర అన్నారు. తాడిపత్రి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం కాకుండా కోటి సంతకాల సేకరణతో అడ్డుకుందామన్నారు. పీపీపీ విధానం వల్ల ఒక్కో వైద్య విద్యార్థిపై రూ.5 లక్షల నుంచి రూ.20లక్షల వరకు భారం పడుతుందన్నారు. చంద్రబాబు విధానాల కారణంగా భావితరాలకు వైద్య విద్య అందకుండా పోతుందన్నారు. అనంతరం మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బెస్త రమణ, ఎంపీపీలు కరణం పుష్పవతి, దేవీబాయి, నరసింహులు, నారాయణరెడ్డి, జెడ్పీటీసీలు ఏసీ పార్వతమ్మ, త్రిలోక్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఐదు మండలాల కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉరవకొండ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

మారుతి సుజుకి- నివ్యా ఆటోమొబైల్స్

షోరూం ప్రారంభం

- మెరిసిన సినీనటి మీనాక్షి చౌదరి



మారుతి సుజుకి మిడ్ - ఎస్‌యూవీ విక్టోరిస్‌ను ఆవిష్కరిస్తున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి, ఎంపీ అంబికా, నివ్యా ఆటో మొబైల్స్ ఎండీ మల్లు ప్రసాద్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్: నగర శివారులోని శిల్పారామం వద్ద జాతీయ రహదారి పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన 'మారుతి సుజుకి ఆరెనా–నివ్యా ఆటో మొబైల్స్ షోరూం'ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా హీరోయిన్ మీనాక్షి చౌదరి ముఖ్య అతిథిగా హాజరై అలరించారు. సినిమా పాటకు స్టెప్పులేసి అదరగొట్టారు. ఆమెను చూడటానికి యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం మారుతి సుజుకి మిడ్ – ఎస్‌యూవీ విక్టోరిస్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరోయిన్ మీనాక్షి చౌదరి మాట్లాడుతూ మారుతి సుజుకి మొదటి నుంచి ఎంతో నమ్మకమైన బ్రాండ్ అన్నారు. తన ప్రయాణం చిన్నప్పుడు మారుతి 800తో మొదలైందని గుర్తు చేసుకున్నారు. జీవితమనేది చాలా విలువైనదని, వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తొలిసారిగా పెట్రోల్ కార్లను మారుతి సంస్థ ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. నివ్యా ఆటో మొబైల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లు ప్రసాద్‌రెడ్డి, మల్లు నివేదితా రెడ్డి మాట్లాడుతూ కొత్త ఆరెనా షోరూమ్‌లో సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్ అన్నీ ఒకేచోట లభిస్తాయని తెలిపారు. నూతన మారుతి సుజుకి విక్టోరిస్ కారు స్ట్రాంగ్ హైబ్రిడ్, మైల్డ్ హైబ్రిడ్ సీఎన్‌జీ, ఆల్‌గ్రిప్ వేరియంట్లలో అందుబాటులో ఉందన్నారు. దీని ధర రూ.10.49 లక్షల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

పండగ పూట విషాదం

- ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీ
- ఇద్దరు యువకుల దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు



లక్ష్మణ సాయి, అరుణ్‌కుమార్ (ఫైల్), గాయపడిన చారుపల్లి బన్నీ

నల్లమాడ: దీపావళి పండగ పూట సంతోషంగా గడపాల్సిన ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మండలంలోని గోపేపల్లి వద్ద ఆదివారం తెల్లవారుజామున ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో నల్లమాడకు చెందిన ఇ.లక్ష్మణ సాయి (19), అరుణ్‌కుమార్ (19) అక్కడికక్కడే మృతిచెందారు. చారుపల్లి బన్నీ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, మృతుల సమీప బంధువులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. భవన నిర్మాణ కార్మికుడైన వెంకటనారాయణ కుమారుడు లక్ష్మణ సాయి, కూరగాయల వ్యాపారి కుల్లాయమ్మ కుమారుడు అరుణ్‌కుమార్, లేట్ గంగులప్ప కుమారుడు చారుపల్లి బన్నీ ముగ్గురు మంచి స్నేహితులు. స్థానిక గంగా థియేటర్ సమీపంలో ఒకే వీధిలో నివాసం ఉంటున్నారు. లక్ష్మణ సాయి ఇంటర్, అరుణ్‌కుమార్, బన్నీ పదో తరగతి వరకు చదివి..అనంతరం చదువు మానేశారు. బన్నీ కొన్ని నెలల క్రితం బెంగళూరుకు వలస వెళ్లి ఓ ప్రైవేట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నట్లు తెలిసింది. లక్ష్మణ సాయి, అరుణ్‌కుమార్ ఇంటి వద్దనే ఉంటూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండేవారు. చారుపల్లి బన్నీ బెంగళూరు నుంచి రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి నల్లమాడలోని షిర్డీ సాయిబాబా గుడి వద్ద ఇతరులు చిన్నమ్మ కథ నాటకం ఏర్పాటు చేశారు. లక్ష్మణ సాయి, అరుణ్‌కుమార్, చారుపల్లి బన్నీ ముగ్గురూ ఆదివారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకు చిన్నమ్మ కథ నాటకాన్ని తిలకించారు.

బస్సు ఎక్కిద్దామని బయలుదేరి..

నాటకం నుంచి వచ్చిన తర్వాత.. బన్నీ బెంగళూరు వెళ్లడానికి కదిరిలో బస్సు ఎక్కించడానికి ముగ్గురూ కలిసి ఒకే ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. కదిరికి వెళ్లారో లేక ఏదైనా కారణంతో మార్గమధ్యం నుంచి ఇంటికి తిరుగుముఖం పట్టారో తెలియదు కానీ గోపేపల్లి వద్ద రోడ్డు మలుపులో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. లక్ష్మణ సాయి, అరుణ్‌కుమార్ ఎగిరి సమీపంలోని బండరాళ్ల మీద పడటంతో ఇరువురికీ తల, ఛాతిపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన చారుపల్లి బన్నీని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కదిరి ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. సీఐ నరేంద్రరెడ్డి తమ సిబ్బందితో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పంచనామా అనంతరం ఇదేరోజు సాయంత్రం లక్ష్మణ సాయికి నల్లమాడలో, అరుణ్‌కుమార్‌కు స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. మృతులిద్దరూ ఏకైక సంతానం కావడంతో తల్లిదండ్రుల దుఃఖానికి అంతులేకుండా పోయింది.

పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం

- మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమోహన్


అనంతపురం టవర్‌క్లాక్: ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం దక్కుతుందని, ఇందుకు సిద్ధం కావాలని మెడికల్, హెల్త్ ఫీల్డ్ స్టాఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రమోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో జరిగిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు అంశాలను ప్రస్తావిస్తూ ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎనుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బలరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వేమారెడ్డి, ట్రెజరర్‌గా ధనుంజయ, ఉపాధ్యక్షుడిగా హరికృష్ణ, సహాయ కార్యదర్శిగా నరసింహరావు, సభ్యులుగా నారాయణ స్వామి, కేవీ రమణ, బాలాజీ, జాన్సన్, గణేనాయక్‌ను ఎంపిక చేశారు. అసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె లక్ష్మన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.రాంకుమార్, రాష్ట్ర నాయకులు బి.వెంకటరమణ, రాఘవేంద్ర, విజయకుమార్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

కదిరి టౌన్: ఆస్తి కోసం కన్నతల్లినే హతమార్చిన కేసులో ఆమె కుమారుడితో పాటు కోడలిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ నారాయణరెడ్డి ఆదివారం వెల్లడించారు. కదిరిలోని నిజాంవలీ కాలనీలో నివాసముంటున్న షేక్ ఖాశింబీకి కుమారుడు, కుమార్తె ఉన్నారు. తాను అడిగిన డబ్బు, ఇంటి పత్రాలు ఇవ్వలేదన్న అక్కసుతో ఈ నెల 12న ఇంట్లో నిద్రిస్తున్న తల్లిని కొడుకు బాబాఫక్రుద్దీన్ కత్తితో పొడిచి హతమార్చి ఉడాయించాడు. ఘటనపై హతురాలి కుమార్తె అమ్మాజాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో బాబాఫక్రుద్దీన్, ఆయన రెండో భార్య రసూల్‌బీని ఆదివారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఫేక్ డాక్యుమెంట్లతో మ్యుటేషన్‌కు దరఖాస్తు

- వజ్రకరూరులో వెలుగు చూసిన ఘటన
- డీఆర్వోకు ఫిర్యాదు చేసిన బాధితులు



రుషింగమయ్య పేరుతో మ్యుటేషన్ కోసం చేసిన దరఖాస్తు

వజ్రకరూరు: ఓ వ్యక్తి తనకు సంబంధం లేని భూమికి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్న ఘటన వజ్రకరూరు మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితులు అప్రమత్తమై డీఆర్ఓకు ఫిర్యాదు చేశారు. అందులోని వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లికి చెందిన పుష్పావతి, రవికుమార్, రమేష్‌బాబు, రాకేష్‌బాబు తదితరులకు అదే గ్రామంలోని సర్వే నంబర్లు 133, 165, 164–1లో 9.75 ఎకరాల భూమి వారి తాత, ముత్తాలకాలం నుంచి సంక్రమించింది. అయితే తాడిపత్రి నియోజకవర్గంలోని నందలపాడు గ్రామానికి చెందిన రుషింగమయ్య అనే వ్యక్తి ఇందులోని మూడు ఎకరాల భూమిని మ్యుటేషన్ టైటిల్‌డీడ్ కమ్ పీపీబీ కోసం ఫేక్ డాక్యుమెంట్లు, ఫేక్ ఫ్యామిలీ సర్టిఫికెట్లతో ఈ నెల 13న వజ్రకరూరు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేశాడు. ఈ తతంగం గురించి తెలుసుకున్న భూమి యజమానులు వజ్రకరూరుకు చేరుకుని కూపీ లాగారు. తర్వాత డీఆర్ఓను అనంతపురంలో కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దరఖాస్తు చేసిన రుషింగమయ్య, సహకరించిన మీ సేవ నిర్వాహకుడు శ్రీనాథ్‌గౌడ్‌లపై విచారణ చేపట్టి.. తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరారు. ఇదిలా ఉండగా జిల్లాలో పనిచేస్తున్న ఓ రెవెన్యూ అధికారి వాట్సాప్ ద్వారా వివరాలు పంపించి, మ్యుటేషన్ చేయాలని ఒత్తిడి చేయడంతో తాను రుషింగమయ్య పేరుతో దరఖాస్తు చేసినట్లు మీ సేవ కేంద్రం నిర్వాహకుడు చెబుతున్నారు.

అ'పూర్వ' కలయిక



ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

కళ్యాణదుర్గం: స్థానిక కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1990–1992 బ్యాచ్ ఇంటర్ సైన్స్ గ్రూపు విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. బ్యాచ్‌లో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు చేయూతనందించాలని తీర్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శశికళ, రత్నాకర్, రామప్ప, కృష్ణ, రామ్మోహన్, శరత్, శ్రీవాణి, హరిత, శారద, సుమిత్రతో పాటు సుమారు 75 మంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కంది పంట కళకళ



కనగానపల్లి వద్ద పూత దశలో ఉన్న కంది పంట

కనగానపల్లి: ఖరీఫ్ సీజన్‌లో మెట్ట భూములలో సాగు చేసిన కంది పంట ఇటీవలి వర్షాలకు కళకళలాడుతోంది. రాప్తాడు నియోజకవర్గంలోని పలు మండలాల్లో కంది పంట ఎక్కువగా సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు పది వేల ఎకరాల్లో కంది పంట సాగు చేయగా, ఒక్క కనగానపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా సాగైంది. ప్రస్తుతం పంట పూత, పిందె దశలో ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే దిగుబడి బాగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. కాగా.. ఈ దశలో పంటకు వ్యాపించే తెగుళ్ల నివారణకు రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

26న జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అనంతపురం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 26న మదనపల్లిలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, అనంత కవులు తరలిరావాలని కళావేదిక అధ్యక్షుడు గుత్తాహరి సర్వోత్తమనాయుడు ఓ ప్రకటనలో కోరారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ నేతృత్వంలో 'అన్నమయ్య సాహితీ ఉత్సవం' పేరిట శ్రీరామ కమ్యూనిటీ హాల్లో ఘనంగా కవి సమ్మేళనం జరుగుతుందన్నారు. ఢిల్లీ, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రతినిధులు విచ్చేస్తున్నారని, పేర్లు నమోదు చేసుకున్న వారికి ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా భోజన వసతి కల్పిస్తామన్నారు. 'అనంత' వాసుల పర్యవేక్షణలో కవి సమ్మేళనం సాగుతుందన్నారు. 95423 22669 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జయమణెమ్మ కల్యాణ మండపంలో వైద్య బ్రహ్మ ధన్వంతరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పది, ఇంటర్ పరీక్షా ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య, కర్నూలు డీఎస్పీ ఉపేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకొని పట్టుదల, క్రమశిక్షణతో మెలిగితేనే ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు సుబ్రమణ్యం, దివాకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణుల తత్వమే దీపావళి



అష్టలక్ష్ములుగా దీపావళి ప్రాశస్త్యాన్ని తెలియజేస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: సాక్షాత్తు లక్ష్మీనారాయణుల ఆధ్యాత్మిక రహస్య స్వరూపమే దీపావళి అని బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారద అన్నారు. ఆదివారం రాత్రి పాతూరులోని ప్రజాపతి ఈశ్వరీయ బ్రహ్మకుమారీల సెంటర్‌లో దీపావళి ప్రాముఖ్యతను తెలిపే అలంకార సేవలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. లక్ష్మీనారాయణులుగా, అష్టలక్ష్ములుగా బ్రహ్మకుమారీలు వేషధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సిస్టర్ శారద మాట్లాడుతూ దీపావళి కాంతులతో అజ్ఞానాన్ని తొలగించే పర్వదినాన్ని ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలన్న సందేశాన్ని లక్ష్మీ స్వరూపులైన వేషధారులు తెలియజేశారన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన అర్బన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, నరసింహారెడ్డి, డాక్టర్ హేమలత తదితరులు సమాజసేవలో బ్రహ్మకుమారీల కృషిని అభినందించారు.

అస్తవ్యస్తం.. అంతా దుర్గంధం



తపోవనం మెయిన్ రోడ్డులో కంప చెట్లు, చెత్త కారణంగా నిలిచిన మురుగు

అనంతపురం రూరల్: నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఏ. నారాయణపురం పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చాలా చోట్ల డ్రైనేజీలు శిథిలమవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ముఖ్యంగా తపోవనం, ఏఎస్ఆర్ నగర్‌లో డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందే నిలిచిపోతున్నాయి. దీంతో పందులు, దోమలు ఆవాసాలుగా మార్చుకున్నాయని, రోజుల తరబడి మురుగు నీరు ఇళ్ల మధ్యనే నిలిచి ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎంతో మంది రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ముగిసిన వేదపఠనం



వేదపండితులను సత్కరిస్తున్న నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని లెక్చరర్స్ కాలనీ వేదమాత భవనం వేదికగా విఖ్యాత వేదపండితులు కైపా హరికృష్ణశర్మ నేతృత్వంలో తొమ్మిది రోజులుగా సాగుతున్న వేదపఠనం ఆదివారం ఘనంగా ముగిసింది. తిరుపతి నుంచి విచ్చేసిన గురుదత్ ఘనాపాటి, నెల్లూరుకు చెందిన శశాంక శేఖర ఘనాపాటి, బెంగళూరుకు చెందిన ఘనాపాటి రాధా కృష్ణ భట్, గుంటూరు బులుసు నాగ గౌతమ ఘనాపాటి, వైఎస్సార్ కడప జిల్లా గండిక్షేత్రం నుంచి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామమోహన ఘనాపాటి తదితరులు సామూహిక వేదపారాయణం, వేదమంత్రాలతో సమావేశాన్ని ముగించారు. విఖ్యాత యజుర్వేద పండితుడు హరికృష్ణశర్మ నేతృత్వంలో జరిగిన సంపూర్ణ శ్రీకృష్ణ యజుర్వేద హవనం, శ్రీకృష్ణ యజుర్వేద జటా పారాయణం, శ్రీకృష్ణ యజుర్వేద జటా పారాయణ విద్వత్సభ నిర్వహించడం అందరికీ సాధ్యం కాదన్నారు. వేదవిద్య అంతరించిపోకుండా విస్తృత ప్రచారం గావించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. హరికృష్ణను ఘనంగా అభినందించారు. అనంతరం ఘనాపాటీలను వేదసమాజం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో దుర్భాక వాసుదేవశాస్త్రి, పాలసముద్రం నాగరాజు, మణూరు నాగరాజశర్మ, ఫణిరాజ్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్ దీపావళి శుభాకాంక్షలు



అనంతపురం క్రైం: దీపావళి పండగ ప్రతి ఇంట్లో వెలుగులు నింపాలని నగర మేయర్ వసీం అన్నారు. చీకటిపై వెలుగుకు.. చెడుపై మంచికి సంకేతమైన దీపావళి పర్వదినం నగరవాసుల కుటుంబాల్లో కొత్త వెలుగులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

నారాయణప్పకు ఘన నివాళి



నారాయణప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: పేదల ఇళ్ల స్థలాల కోసం భూపోరాటాలు చేసిన కందుకూరు నారాయణప్ప బాటలో నడవాలని నాయకులు, కార్యకర్తలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పి.రామకృష్ణ అధ్యక్షతన నారాయణప్ప వర్ధంతి నిర్వహించారు. నారాయణప్ప చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగదీష్, జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్ మాట్లాడారు. వీకే ఆదినారాయణరెడ్డి, ఐదుకల్లు సదాశివన్, పూలకుంట సంజీవులు వంటి నాయకులతో కలిసి నారాయణప్ప ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి,నాయకులు శ్రీరాములు, పద్మావతి, లింగమయ్య, రమేష్, రమణయ్య, రాజేష్, పార్వతి ప్రసాద్, వరలక్ష్మి, శారద పాల్గొన్నారు.

బావా ఎపుడు వచ్చితివో నీవు!

- ఆకట్టుకున్న డీఆర్వో మలోల నాటక ప్రదర్శన



పాన్పుసీనులో మలోల, రంగస్వామి

అనంతపురం కల్చరల్: దీపావళి పర్వదినాల సందర్భంగా సాగిన నాటకాలు ప్రేక్షకులను సమ్మోహన పరిచాయి. ఆణిముత్యాలు పేరిట భగవాన్ శ్రీసత్య సాయిబాబా నాటక సమాజం వారి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక కృష్ణకళామందిరంలో వివిధ నాటక ప్రదర్శనలు జరిగాయి. ముఖ్యంగా పాన్పుసీనులో కృష్ణుడిగా డీఆర్వో మలోల, దుర్యోధనుడిగా అసిస్టెంట్ కమిషనర్ రంగస్వామి, అర్జునుడిగా రమణమూర్తి పోటీపడి తమదైన నటనతో మెప్పించారు. ముఖ్యంగా బావా ఎపుడు వచ్చితివో నీవు అంటూ రాగయుక్తంగా సాగిన పద్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే గయోపాఖ్యానం, బాల నాగమ్మ, సుభద్రరాయబారం, సత్యహరిశ్చంద్ర, శ్రీరామాంజనేయయుద్ధం తదితర ఘట్టాలను హృద్యంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని యర్రజిన్నన్నగారి పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కేశన్న(54) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, నాయకులు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, క్రిష్ణమూర్తి, సుబ్బిరెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని కేశన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

జోరుగా 'కోటి సంతకాల సేకరణ'



గుల్జార్‌పేటలో..



సీఎస్ఐ హోలీ చర్చిలో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

అనంతపురం: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఆయా డివిజన్ల పరిధిలో ఆదివారం చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ'కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎగ్గుల శ్రీనివాసులు, పార్టీ సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జానీ, జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు, జిల్లా కార్యదర్శి పుట్లూరు ప్రభాకర్ , నగర అధ్యక్షుడు టి. సతీష్ కుమార్, పాస్టర్లు అబ్రహాం, సాల్మన్ రాజ్, జాకబ్, అహోరోన్, నరేష్, వాసు అనిల్‌కాంత్, మహమ్మద్ రిజ్వాన్, భీమలింగేశ్వర్, సాయి, రవి, రమేష్ కుమార్, నరసింహా రెడ్డి, కేశవ రెడ్డి, మసూద్, సుందర్, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న రాఘవేంద్ర

అనంతపురం టవర్‌క్లాక్: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అందరూ వ్యతిరేకించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలన్నారు. 2025 విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. బిల్లు చట్టంగా మారితే విద్యుత్ రంగం ప్రైవేటీకరణ అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా పోరాడతామని, ప్రజలు కూడా పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తబ్రేజ్‌ఖాన్, సుబ్రమణ్యం, మహేష్, సురేష్, చరణ్, తేజ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డ్యాన్స్ స్పోర్ట్స్ పోటీలకు అనూహ్య స్పందన



డ్యాన్స్ స్పోర్ట్స్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం కార్పొరేషన్: ఇండోర్ స్టేడియంలో ఆదివారం డ్యాన్స్ స్పోర్ట్స్ ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని నృత్యప్రదర్శన చేశారు. పోటీలను ఆర్‌డీఓ మలోల పరిశీలించారు. విద్యతో పాటు క్రీడలు, నృత్యం, తదితర అంశాల్లో ప్రావీణ్యం ఉండాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిళ్లను అధిగమించడానికి క్రీడలు బాగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డ్యాన్స్ స్పోర్ట్స్ సంఘం మురళీకృష్ణ, ధనుంజయ పాల్గొన్నారు.

అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటు

- టీడీపీ నాయకులపై ఎంపీపీ హేమలత ఫైర్



టీడీపీ నేతల దొంగ బిల్లులను చూపిస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: కనీస అవగాహన లేకుండా టీడీపీ నేతలు మాట్లాడటం సిగ్గు చేటని ఎంపీపీల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత మండిపడ్డారు. ఆదివారం ఆత్మకూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి టీడీపీ నేతలు పనులు చేయకుండా అక్రమంగా దోచుకున్నారన్న విషయం బట్టబయలు కావడంతో ఏం చెయ్యాలో తెలియక తమపై బురద చల్లుతున్నారని విమర్శించారు. మండల వ్యాప్తంగా ఉపాధి పనులు చేసిన వారికి సగం మాత్రమే బిల్లులు వేస్తున్నారని పలువురు కూలీలు తనకు ఫిర్యాదు చేశారన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టమొచ్చినట్లు బిల్లులు జమ చేస్తున్నారని ఆరోపించారు. తాము దొంగ బిల్లులు చేయించుకున్నామని సమావేశాలు పెట్టి మరీ చెబుతున్నారని, అయినా కనీస అవగాహన లేకుండా మాట్లాడితే ఎలా అని టీడీపీ నేతలపై మండిపడ్డారు. తాను హార్టికల్చర్ పనుల బిల్లులు చేస్తే అవి దొంగ బిల్లులు అంటూ ఆరోపిస్తున్నారన్నారు. పనికి వెళ్లాలంటే ముందుగా పని కల్పించాలని, పని కల్పించినదానికి, బిల్లులు వేయించేదానికి తేడా లేదా అంటూ నిలదీశారు. ప్రస్తుత టీడీపీ మండల కన్వీనర్ గంతి శ్రీనివాసులు దంపతులు (జాబ్ కార్డు నంబర్ ఏపీ-12-024-011- 005- 30664) ఉపాధి హామీ పనులకు వెళ్లకుండా 2024 ఆగస్టు నుంచి 2025 వరకు బిల్లులు ఎలా వేయించుకున్నారని, దీనికి అధికారులు ఎలా సహకరించారని ప్రశ్నించారు. తన గురించి మాట్లాడేటప్పుడు తాము చేసే తప్పులు తెలుసుకోవాలని హితవు పలికారు.

సందేశాత్మక లఘుచిత్రం



కళాకారులను అభినందిస్తున్న విశా ఫెర్రర్, డాక్టర్ హరిప్రసాద్ తదితరులు

అనంతపురం కల్చరల్: డ్రగ్స్ వాడకంతో నిర్వీర్యమైపోతున్న యువత జీవితాలకు అద్దం పడుతూ సాగిన లఘుచిత్రం సందేశాత్మకంగా ఉందని ఆర్డీటీ డైరెక్టర్ విశా ఫెర్రర్, 'అబ్బా' టీవీ డాక్టర్ హరిప్రసాద్ అన్నారు. సీనియర్ కళాకారుడు తరిమెల రాజు దర్శకత్వంలో నిర్మాణమైన 'డీఎఫ్‌ఐ (డ్రగ్స్ ఫ్రీ ఇండియా)' లఘుచిత్ర ఉచిత ప్రదర్శన ఆదివారం నగరంలోని నీలిమ థియేటర్‌లో సాగింది. జిల్లా వ్యాప్తంగా సీనియర్ కళాకారులు, గాయనీ గాయకులు, రచయితలు, కవులు ఆత్మీయంగా పాల్గొని చిత్రబృందాన్ని అభినందించారు. విశా ఫెర్రర్‌తో పాటు సినీనటుడు రమేష్ నీల్, కాంగ్రెస్ నాయకుడు ఇమామ్, ఘంటసాల స్మారక సేవా సంఘం ప్రతినిధులు రామయ్య, ఆచార్య సుధాకరబాబు, రవికాంత్ రమణ మాట్లాడారు. దశాబ్దాలుగా అనంత కళారంగానికి సేవలందిస్తున్న తరిమెల రాజు అద్భుతమైన సందేశాత్మక చిత్రాన్ని తీయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో చిత్ర సమర్పకులు ప్రసాద్, కెమెరామెన్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన త్రయోదశి వేడుకలు



పూజలందుకున్న ఐశ్వర్యేశ్వరుడు

అనంతపురం కల్చరల్: ధన త్రయోదశి వేడుకలు ఆదివారం పలు ఆలయాలలో పెద్ద ఎత్తున జరిగాయి. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ దేవాలయంలో కుబేర సమేత అనంత ఐశ్వర్యేశ్వరునికి కుంభాభిషేకం జరిగింది. ప్రధాన అర్చకులు బసవరాజ స్వామి నేతృత్వంలో అధిక సంఖ్యలో భక్తులు స్వయంగా స్వామివారికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ధన త్రయోదశి ప్రత్యేకత గురించి వివరించారు. సాక్షాత్తు పరమ శివుడే ఐశ్వర్యేశ్వరుడి రూపంలో కుబేరుడిని ధనరాశులకు అధిపతిగా నియమించారని, ధనత్రయోదశి నాడు చేసే పూజలతో సకల సంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసమన్నారు. అలంకార సేవలనంతరం ప్రసాద వినియోగం జరిగింది. మఠం విజయ్‌కుమార్, వీర బసవమ్మ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నగర శివార్లలోని శివ బాలయోగి ఆశ్రమం, పాతూరు శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయం తదితర చోట్ల ధనత్రయోదశి వేడుకలు ఘనంగా జరిగాయి.

హాకీకి పూర్వవైభవం తీసుకొస్తాం

- హాకీ సంఘం జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్

అనంతపురం కార్పొరేషన్: హాకీకి పూర్వవైభవం తీసుకొస్తామని హాకీ సంఘం జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం హాకీ అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాకీ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా ముందుకెళ్దామన్నారు. వచ్చే నెల 7న హాకీ ఇండియాకు వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా చేపట్టనున్న కార్యక్రమాలను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. ఆ రోజున మారథాన్, తదితర కార్యక్రమాలను చేపడదామన్నారు. కార్యక్రమంలో హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు విజయబాబు, ఉపాధ్యక్షుడు దేగల మహేష్, ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే అన్ని రంగాల్లో ప్రగతి

అనంతపురం రూరల్: ఐక్యంగా ఉంటేనే రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవచ్చని కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కనకదాస కల్యాణ మండపంలో కురుబ కులస్తుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కురుబలు కలసి ఉంటే ఏదైనా సాధించుకోవచ్చన్నారు. కురుబలు చాలా చోట్ల ఇంకా ఎంతో వెనకబడి ఉన్నారని, అలాంటి వారికి సహాయ సహకారాలు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నేటికీ చాలా చోట్ల పిల్లలను మధ్యలోనే చదువులకు దూరం చేస్తున్నారని ఇది సరికాదన్నారు. విద్య ఉంటేనే సమాజంలో రాణించగలమన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. అనంతరం ఇటీవల ఉపాధ్యాయ, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన కురుబ కులస్తులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పిడుగు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కేసీ నాగన్న, జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణ,బ్రహ్మనంద, బోరంపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా టీకే శ్రీనివాస రావు, ఉపాధ్యక్షుడు పి. ఓబులేసు, కార్యదర్శి జి. వెంకటపతి, సమిష్టి కార్యదర్శి ఎం. ప్రతాప్ రెడ్డి, కోశాధికారి నాగన్న, కార్యనిర్వాహక సభ్యులు ఆదిభైరవ మూర్తి, కృష్ణమూర్తి, బి. రెడ్డప్ప, ఆంజనేయులు, ఎస్.బలరాం, ఎం. వెంకట మునిరెడ్డి ఎంపికయ్యారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కాలసర్పదోష రాహుకేతు నివారణ హోమాలు చేశారు. స్వామి వారి స్వర్ణముఖ కవచాన్ని ఆలయం చుట్టూ మేళతాళాలతో ప్రదక్షిణలు చేయించారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు చేసి మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.